క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తాటిచెట్లపాలెం: ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్, సబ్ స్టేషన్ పరిధిలోని పలు 11 కేవీ ఫీడర్లలో జరుగుతున్న నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 19న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాధవధార వుడా కాలనీ, గంగా గోదావరి అపార్ట్‌మెంట్, శ్రీ శాంతి ల్యాండ్‌మార్క్, విజేత మార్ట్, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, గ్యాస్ గొడౌన్ జంక్షన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతం, సాకేతపురం, విమాన్‌నగర్, వినోద్‌నగర్, ఎన్ఏడీ, జాకీర్ హుస్సేన్ నగర్, పార్వతీనగర్, గాంధీనగర్, రైతుబజార్ ఏరియా, రాజీవ్ నగర్, అప్పయ్యనగర్, గాంధీనగర్, వంశీ నగర్, నరసింహనగర్, కాకానినగర్, దుర్గా పురం, సాయినగర్, ఆర్ అండ్ బీ జంక్షన్, మర్రిపాలెం వుడా లేఅవుట్, మహత్ కాలనీ, రామన్న కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏజీఎం సదాశివం, అసోసియేషన్ ప్రతినిధులు

మల్కాపురం: హిందుస్తాన్ షిప్‌యార్డ్ యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను షిప్‌యార్డ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఏజీఎం సదాశివం ఆవిష్కరించారు. సంస్థ ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉరుకూటి మురళీధర్, జోగరాజుతో పాటు ప్రతినిధులు చొప్పా చిరంజీవి, సింహాచలం, నర్సింగరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి సందర్భంగా మాజీ మంత్రి దివంగత నేత గుడివాడ గురునాథరావు జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 68వ వార్డు మిందిలో నిర్వహించిన పోటీలు వారం రోజుల పాటు జరిగాయి. పోటీల్లో విజేతలకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం జరిగింది. పోటీల్లో మింది గ్రామానికి చెందిన కింగ్స్ మెన్ ఎలెవెన్స్ ప్రథమ విజేతలుగా నిలవగా ఫన్నీ గైస్ జట్టు ద్వితీయ విజేతగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

నూతన వస్త్రాలు, పింఛన్ అందజేత



నూతన వస్త్రాలు, పింఛన్ అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు, దాతలు

అగనంపూడి: సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పింఛన్‌దారులకు ప్రతి నెలా అందించే పింఛన్‌తో పాటు స్థానిక నాయకుడు బలిరెడ్డి నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో నూతన వస్త్రాలను అందజేశారు. 85వ వార్డు పెదమడకలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 65 మంది పింఛన్‌దారులకు రూ.200 చొప్పున నగదు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాజువాక జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మి రామునాయుడు, నాయకులు గవర సోమశేఖర్, దాసరి త్రినాథ్, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష..’ ఆరోగ్యానికి భరోసా



జీవీఎంసీ 58వ వార్డు ములగాడ ఆరోగ్య కేంద్రంలో రోగులకు సూచనలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పరిపాలనలో కొత్త ఒరవడి సృష్టించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాలు, అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఇందుకు చక్కటి ఉదాహరణ. ఈ శిబిరాలలో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ పేదల సంపూర్ణ ఆరోగ్యానికి సీఎం అలుపెరుగని కృషి చేస్తున్నారు. తమ పట్ల ముఖ్యమంత్రి జగన్ కనబరుస్తున్న శ్రద్ధకు పేద ప్రజలు ఆయనకు నీరాజనం పలుకుతున్నారు.

- ములగాడలో సేవలందించిన వైద్య సిబ్బంది
- డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో ఆరోగ్య శిబిరం నిర్వహణ



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ తిలక్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొని శిబిరానికి వచ్చిన రోగులకు సేవలందించారు. అవసరం అయిన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో స్త్రీ సమస్యలు, రక్తహీనత సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. తగిన సలహాలు అందజేసి మందులిచ్చారు. శిబిరానికి హాజరైన వార్డు కార్పొరేటర్ లావణ్య రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలంతా ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. గ్రామ, పట్టణ పరిధిలో గల రోగులకు వారి ఇంటి వద్దే వైద్య సేవలందిస్తు ఇతర రాష్ట్రాల వారికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్దాడ వెంకటరమణ, సన్యాసిరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. త్రినాథపురంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రినాథపురం సచివాలయ పరిధిలో వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి టోకెన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఫేజ్–1లో వైద్య సేవలు వినియోగించుకోలేని వారు కూడా ఈ దఫా ఆ సౌకర్యం పొందవచ్చన్నారు. వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితంగా ఇస్తారని, అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారన్నారు. వ్యాధి నయమయ్యే వరకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇందిరానగర్–3 క్రాంతినగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి ఐశ్వర్య, వార్డు అధ్యక్షుడు బీశెట్టి గణేష్, పెద్దాడ ప్రసాద్, సత్యనారాయణ, సీహెచ్ కనకారావు, దివేష్, స్థానిక నాయకులు, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ములగాడలో పట్టాల పంపిణీ

అర్హులకు రిజిస్టర్డ్ పత్రాలు అందజేసిన ఆనంద్‌కుమార్



అర్హులకు పట్టాలందజేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: మాట నిలబెట్టుకునే మహా నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు ములగాడ మండల రెవెన్యూ కార్యాలయం పరిధిలో గల 40,58,59,60,61,62,63 వార్డుల పరిధిలో గల అర్హులకు సుమారు 3 వందల ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వం పట్టాలు ఇస్తామని నమ్మించి పలువురి వద్ద నుంచి కొంత సొమ్ము తీసుకుని మొండి చెయ్యి చూపిందన్నారు. కానీ జగనన్న సర్కార్‌లో ఒక్క పైసా ఖర్చు లేకుండా లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్ చేసి ఆ పత్రాలు అందిస్తుందన్నారు. ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలని, నాటి ప్రభుత్వ పని తీరు, నేటి ప్రభుత్వ పని తీరు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌వో వీరభద్రరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్లా లక్ష్మణరావు, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, గుండపు నాగేశ్వరరావు, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, పలు వార్డుల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల సేవలు చిరస్మరణీయం

డిప్యూటీ మేయర్ శ్రీధర్



శ్రీ కృష్ణదేవరాయలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్ తదితరులు

విశాఖ విద్య: శ్రీ కృష్ణదేవరాయలు సేవలు చిరస్మరణీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కొనియాడారు. ఎన్ఏడీ కాకాని నగర్‌లో ఉన్న కాపు, తెలగ, బలిజ సామాజిక భవనంలో బుధవారం కృష్ణదేవరాయల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జియ్యాని మాట్లాడుతూ కృష్ణదేవరాయల పరిపాలన సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా పాలన అందించారన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, వి. భాస్కరరావు, బీఎస్ నాయుడు, దాసరి తేజ, కంపర సత్తిబాబు, సమ్మెట్ల రామకృష్ణ, సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు




పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు



చిన్నారికి బహుమతి అందజేస్తున్న గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు రెడ్డితుంగ్లాంలో కోదండ రామాలయ పరసను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బుధవారం ఉదయం నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చేతుల మీదుగా స్టీల్ బిందెలను బహుమతిగా అందించారు. చిన్నారి వేసిన ముగ్గుకు కన్సొలేషన్ బహుమతిగా రెండు బిందెలు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సతివాడమ్మ పరస రేపు



సతివాడమ్మ తల్లి

పెందుర్తి: గొరపల్లిలో కొలువైన ఏడు గ్రామాల ఇలవేల్పు సతివాడమ్మతల్లి పరసను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం తప్పెటగుళ్లు, కోలాటాలు, భజనలు ఉంటాయని తెలియజేశారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణలో పాల్గొన్న కేటీబీ జేఏసీ ప్రతినిధి రాము, డిప్యూటీ మేయర్ శ్రీధర్

అగనంపూడి: తెలుగు జాతికి, భాషా ఔన్నత్యానికి గుర్తింపు తీసుకువచ్చిన శ్రీకృష్ణదేవరాయల కీర్తి నలుదిశలా వ్యాపించేలా కృషి చేయాలని రాష్ట్ర కేటీబీ జేఏసీ ప్రతినిధి దాసరి రాము, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నవానిపాలెంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగిన మహోన్నత వ్యక్తుల్లో శ్రీకృష్ణదేవరాయలు ముందు వరుసలో ఉంటారన్నారు. స్థానికంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన గ్రామాభివృద్ధి కమిటీని వారు అభినందించారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి రోజున విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా నాయకురాలు గొన్నా రమాదేవి, అఖిలపక్షాల నాయకులు గవర సోమశేఖర్, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, పాముల వసంతరావు, కరణం కళావతి, దాసరి వెంకట జయలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుమ్మల శ్రీను, ఇల్లపు శ్రీను, నరేంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల విజేతకు సత్కారం



ధనుష్‌ను సత్కరిస్తున్న జిమ్ నిర్వాహకులు

పెదగంట్యాడ: మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో గంగవరం గ్రామానికి చెందిన ధనుష్ సత్తా చాటాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఈ నెల 14న వెస్ట్ గోదావరి బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. 55 కిలోల లోపు విభాగంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే మెన్స్ ఫిజిక్ పోటీల్లోనూ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని బంగారు పతకాలు సాధించాడు. ధనుష్‌ను స్వామి ఫిట్‌నెస్ జిమ్‌లో బుధవారం ఘనంగా సత్కరించారు. పీత గురుమూర్తి, జి.తాతారావు, దుర్గారావు, రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని ఎన్‌జేసీఎస్ సభ్యులు, హెచ్ఎంఎస్ స్టీల్, మెటల్, ఇంజినీరింగ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సంజయ్ వాడకర్ కోరారు. ఈ మేరకు ఆయన స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు లేఖ రాశారు. ఎన్‌జేసీఎస్ ఒప్పందం మేరకు సెయిల్‌లో అన్ని ప్లాంట్లలో కార్మికులకు నూతన వేతనాలు అమలు జరిగాయన్నారు. అయితే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యం కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకుని, వారికి నూతన వేతనాలు అమలు చేయాలని కోరారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి పరస



పూజలందుకున్న ముత్యాలమ్మతల్లి



రామాలయం వద్ద భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వేపగుంటవాసుల ఇలవేల్పు ముత్యాలమ్మతల్లి పరస మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. తప్పెటగుళ్లు, సాముగరిడీలు, కోలాటాలు సందడిగా సాగాయి. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రంగులరాట్నాలు, వివిధ రకాల ఆటలతో పిల్లలు సందడి చేశారు. వేపగుంట, పురుషోత్తపురం, నాయుడుతోట, అప్పన్నపాలెం, చీమలాపల్లి, లక్ష్మీపురం ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

ఘనంగా రాములోరి తీర్థం

పరవాడ: పరవాడ గ్రామంలోని శ్రీ రాముల వారి తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా జరిపించారు. ఆలయం వద్ద నిర్వహించిన భజనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ మహోత్సవంలో భజనలతో పాటు చిడతలు, సాముగరిడీలు, నేల డ్యాన్సులు, చిటికల భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, పరవాడ సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి, స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అప్పన్న ఆలయంలో ‘స్వచ్ఛ తీర్థ’

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్ నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపం, భోగ మండపం, ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. అలాగే స్వామివారి పూజా సామగ్రిని శుభ్రం చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆస్థాన మండపాన్ని శుభ్రం చేయిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

నిరుపేదల సంజీవిని

సీఎం జగన్ పేదల ఆరోగ్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రైమరీ హెల్త్ సెంటర్లకు రూపకల్పన చేశారు. ఇక్కడికి రోజుకొక స్పెషలిస్ట్ డాక్టర్ వచ్చి పేదలను పరీక్షించి, వైద్యం చేసి, మందులిస్తున్నారు. ఇలా కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా సీఎం జగన్ హయాంలోనే తమకు అందుతుందని పేదలు మురిసిపోతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు.

- ప్రైమరీ హెల్త్ సెంటర్
- రోజుకొక స్పెషలిస్ట్ డాక్టర్‌తో ప్రత్యేక వైద్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ములగాడ పట్టణ ఆరోగ్య కేంద్రం



మల్కాపురం: గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులుండేవి కాదు. ఎవరైన రోగికి సాధారణ లేదా అత్యవసర వైద్య సేవలందాలంటే కేజీహెచ్‌కైనా వెళ్లాలి.. లేదా అప్పు చేసుకుని కార్పొరేట్ ఆస్పత్రికైనా పరుగులు తీయాలి. ఇలా పేదలు పడుతున్న బాధలు గమనించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి వార్డులో హెల్త్ సెంటర్లు ఉండాలని, వాటి ద్వారా స్థానికులకు ఉచితంగా వైద్య సేవలందించాలని సంకల్పించారు. ఆ సంకల్పంలో ఎంతో బలం ఉంది కాబట్టి పారిశ్రామిక ప్రాంతంలో కోట్ల రూపాయలతో పలు వార్డుల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు వెలిసాయి. కన్నబిడ్డలే తల్లిదండ్రులను పట్టించుకోని నేటి రోజుల్లో రాష్ట్రంలో ప్రతి ఒక్క వ్యక్తి తన కుటుంబ సభ్యుడే అని సీఎం భావిస్తున్నారు. దీనిలో భాగంగా 58వ వార్డు ములగాడ గ్రామంలో గత ఏడాది రూ. కోటి రూపాయల వ్యయంతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం) నిర్మించారు. విశాలమైన స్థలంలో మౌలిక వసతుల కల్పనతో ఇక్కడ వైద్య కేంద్రం ఏర్పాటు చేయటంతో వార్డు పరిధి ములగాడ, ఎదురువానిపాలెం, గొందేశివానిపాలెం, పిలకవానిపాలెం తదితర ప్రాంతాల నుండి రోజూ పదుల సంఖ్యలో రోగులు ఇక్కడికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు, ఖరీదైన మందులు పొందుతున్నారు. పరీక్షలు కూడా చేయించుకుంటున్నారు.

ఉదయం 10 నుంచి సేవలు..

ప్రతిరోజూ ఆస్పత్రికి వచ్చే వైద్య నిపుణులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రోగులను పరీక్షించి వైద్య సేవలందిస్తారు. తగిన జాగ్రత్తలు చెప్పి మందులిస్తారు.

ఆస్పత్రిలో రోజువారి అందుబాటులో ఉండే సేవలు..

సోమవారం	:	సాధారణ శస్త్రచికిత్సలు
మంగళవారం	:	శ్వాస విభాగం వైద్య నిపుణులు
బుధవారం	:	ఎముకలు, కండరాల వైద్య నిపుణులు
గురువారం	:	జనరల్ వైద్యం
శుక్రవారం	:	చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు
శనివారం	:	చర్మ వ్యాధి నిపుణులు

మంచి ఆలోచన



పట్టణ పరిధి పలు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో రోగులకు ఉచితంగా మంచి వైద్యం అందిస్తున్నారు. సీఎం జగన్ తీసుకున్న ఈ ఆలోచన పేద రోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఈ రోజుల్లో ఎటువంటి చిన్న రోగం వచ్చినా పరీక్షలకే రూ. 5 వందల నుండి రూ. వెయ్యి వరకు చెల్లించుకోవాల్సిందే. వైద్యుడికి, మందులకి అదనంగా చెల్లించుకోవాలి. పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఒక్క పైసా ఖర్చు లేకుండా పరీక్షలు, వైద్యం, మందులు అన్నీ దొరుకుతున్నాయి. – **ఆదారి హరీష్, యూత్ నాయకుడు**

అందుబాటులో వైద్య సేవలు



గతంలో వైద్యం కోసం గాజువాక లేదా నగరంలో గల వైద్య నిపుణుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. దీని కోసం చాలా శ్రమ పడేవాళ్లం. అయితే నేడు అటువంటి పరిస్థితి లేదనే చెప్పాలి. సీఎం జగన్ ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రోజుకొక స్పెషలిస్ట్ వైద్యుడు వచ్చి పరీక్షలు చేసి.. మందులిస్తుండడంతో మాకు ఎంతో వెసులుబాటుగా ఉంది. దీనివల్ల ఉచితంగా పరీక్షలు, వైద్యం, మందులు పొందుతున్నాం. సీఎం జగన్‌కు ధన్యవాదాలు

– **శ్రీనివాస్‌రాజు, లారీ డ్రైవర్**

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



లబ్ధిదారుకు గ్యాస్ పొయ్యి అందజేస్తున్న ఎంపీ జీవీఎల్

పెదగంట్యాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉజ్వల యోజనలో భాగంగా పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. 76వ వార్డు బాలచెరువులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు వీటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, జీలకర్ర రమణ, జీలకర్ర భువనేశ్వరి, కిల్లాన మునలయ్య తదితరులు పాల్గొన్నారు.